క్లుప్తంగా

జిల్లా అభివృద్ధి కోసం ఉద్యమం

–సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

బి.కొత్తకోట: జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. ఆదివారం బి.కొత్తకోటలో జరిగిన ఆ పార్టీ నాయకుల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 21న జిల్లా కమిటీ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేయాలని, పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చర్చిస్తామన్నారు. కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ చేశారు. జిల్లాలో చేపట్టే కార్యక్రమాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో కృష్ణప్ప, సాంబశివ, మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పీలేరు : ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు అరవింద్ నేత్రాలయ సిబ్బంది శంకర్ తెలిపారు. ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెళ్లకూరు చాంగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ నేత్రాలయం వారి సహకారంతో మేనేజింగ్ ట్రస్టీ గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి 130 మంది హాజరుకాగా, 50 మందికి ఉచితంగా మందులు, 38 మందికి కంటి అద్దాలు, 40 మందికి కంటి ఆపరేషన్లుకు రెఫర్ చేసినట్లు ఏఓ కృష్ణాగల్లా తెలిపారు.

పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలి

పీలేరు : పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ సభ్యుడు బోదేషావల్లి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన పీలేరు పట్టణంలో రైతు బజారు లేకపోవడంతో రోజువారి కూలీలు, రైతులు వారం రోజులకు సరిపడే నిత్యవసర వస్తువులు, కూరగాయలు కేవలం వారపు సంతలో మాత్రమే కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో రోజువారి రైతు బజార్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వం రాయితీపై కందిపప్పు, పామోలిన్ వంటినిత్యవసర సరుకులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ఉలవల గంగమ్మకు ప్రత్యేక పూజలు

పీలేరు రూరల్: మండలంలోని తలపల పంచాయతీ గ్రామ దేవత ఉలవల గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం భక్తులు ఉపవాసదీక్షతో మొక్కులు చెల్లించారు. ఆలయానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు మల్లికార్జుననాయుడు, సాగర్‌రెడ్డి, అర్చకులు రాజుస్వామి ప్రత్యేక అలంకరణ చేసి పూజల అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న విజయలక్ష్మి

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోహాల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లెకు చెందిన వి గ్లో బ్యూటీ పార్లర్ విజయలక్ష్మి హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్ధిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ నాగేశ్వరరావు

వాల్మీకిపురం: ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాల్మీకిపురం ఎస్‌ఐ నాగేశ్వరావు అన్నారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్సు, వాహనాల రికార్డులు, ఇన్సూరెన్స్, ట్యాక్స్ తదితర వాటిని తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. అలాగే ఎవరైనా సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురి చేస్తే పెద్దలకు జైలు శిక్ష తప్పదన్నారు.

అమ్మ పేరుతో మొక్క..భూమాతకు రక్ష

- మొక్కలు నాటాలని ప్రధాని మోదీ పిలుపు
- పాఠశాలల్లో నిర్వహించేలా విద్యాశాఖ ఆదేశాలు





మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ (ఫైల్)

మదనపల్లె సిటీ: 'వన మహోత్సవంలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి. నేనూ మా అమ్మ స్మారకార్థం ఒక మొక్క నాటాను. ఇది ఉద్యమంలా సాగడం నాకెంతో సంతోషాన్నిస్తోంది. చాలా మంది తమ మాతృమూర్తులను తీసుకెళ్లి మొక్కలు నాటుతున్నారు. తల్లులు చనిపోయిన వారు వారి ఫొటోలను తీసుకెళ్లి ఈ కార్యక్రమం చేస్తున్నారు. ఆ చిత్రాలను సోషియల్ మీడియా పంచుకుంటున్నారు. ఈ ప్రచారం భూమాతను రక్షించడానికి సహాయపడుతుంది'. ఇవీ మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి మోదీ వ్యాఖ్యలు.

అమ్మ.. మొక్క.. భూమాత మూడింటి మధ్య సారూప్యత ఉంటుంది. అమ్మ కుటుంబమంతటినీ బాధ్యతగా ఒక గొడుగు కింద సంరక్షిస్తే పర్యావరణంలోని జీవరాశులన్నింటి మనుగడకు మొక్కలు కీలకం. పర్యావరణం అంతటినీ ఓపికతో భరించేది భూమాత. స్వాభావికంగా మూడింటి మధ్య ఉన్న అనుబంధం మనసులో మాటగా ప్రధానిమోదీ ముడిపెట్టారు. వానాకాలం మొదలైంది. అడపాదడపా వర్షం కురుస్తోంది. మొక్కలు నాటడానికి అనువైన సమయంలో వన మహోత్సవం నిర్వహిస్తూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ఈ ఉద్యమంలో పాల్గొని సామాజిక చైతన్యం చాటిల్సిన తరుణమిది.

తరాలకు స్ఫూర్తి

ప్రకృతి ప్రకోపాన్ని నిత్యం ఎదుర్కొంటున్నాం. ఒక్కోసారి వరదలు బీభత్సం సృష్టిస్తుంటే ..మరోసారి చుక్కనీరు రాని పరిస్థితి. నానాటికీ ఎండల తీవ్రత పెరుగుతోంది. చెట్లు ఇష్టారీతిన నరకడంతో వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. అందుకే మొక్కల ప్రాధాన్యం చాటేలా వివిధ రూపాల్లో చైతన్య నినాదాలు పుట్టుకొస్తున్నాయి. సమాజంలో అందరికి అమ్మ అంటే గౌరవం. అలాంటి అమ్మ పేరుతో నాటిన మొక్కను అంతే గౌరవంగా పెంచితే వృక్షమై కొన్ని తరాలకు నీడ, గాలిని అందిస్తుంది. పండ్ల మొక్క అయితే పండ్లతో కడుపు నింపుతుంది. మనిషి జీవితంలో అమ్మ మాదిరిగానే ప్రతి అవసరాన్ని తీర్చే మొక్కకు అమ్మకిచ్చినంత గౌరవం ఇవ్వాలి. మదనపల్లెలో పలువురు మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ పేరిట మొక్కలు నాటాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటించడంతో పాటు సంరక్షించాలని ఆదేశించారు.

పచ్చదనం సృష్టించి..

మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఐదు సంవత్సరాల నుంచి నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో డివిజనల్ గ్రీన్ మాస్టర్ భాస్కరన్ విద్యార్థులతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించారు. పాఠశాల పచ్చదనంగా మారింది. దీంతో 2020లో జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ అవార్డును సీఎస్ఈ డైరెక్టర్ సునిత నారాయణ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రతి ఏడాది పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎన్‌జీసీ టీచర్ ఆధిలక్ష్మి, పీడీ శివశంకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

బహుమతిగా అందిస్తూ..

నిత్యం జరిగే కార్యక్రమాలకు హాజరవుతూ బహుమతిగా ఓ మొక్కను అందజేస్తున్నారు మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్. వివాహాలు, పలు కార్యక్రమాలకు వెళ్లినప్పుడు మొక్కలను బహుమతిగా అందిస్తున్నారు. ప్రతి ఏటా జరిగే వినాయకచవితికి మట్టి వినాయకుని ప్రతిమతో పాటు మొక్కను అందజేస్తున్నారు. ఇలామొక్కలు పెంపకం కోసం సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

లయన్స్ క్లబ్ సంకల్పం

మదనపల్లెకు చెందిన లయన్స్ క్లబ్ ఏటా పిల్లలతో విత్తన బంతులు తయారు చేయిస్తుంది. మర్రి, రాగి, పగడ, మహాగని, వేప, నారవేప, నల్లమద్ది, విప్ప, చింత తదితర విత్తనాలు సమీపంలోని చెరువులోలని రేగడి మట్టిని తెచ్చి అందులో ఆవుపేడను కలిపి తయారు చేస్తారు. ఈసారి సుమారు లక్షకుపైగా విత్తన బంతులను మాదినకొండ,తెట్టు అటవీ ప్రాంతాల్లో చల్లారు. అలాగే స్థానిక మహిళా డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విత్తన బంతులు తయారు చేసి బసినికొండ, మాదినకొండల్లో చల్లారు.

ప్రతి ఆదివారం మొక్కలు నాటుతున్నారు

ఆదివారం సెలవు కావడంతో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటుతున్నారు. వాటిని సంరక్షించడం కూడా బాధ్యతగా తీసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ద్విచక్ర వాహనాల్లో ఆంధ్రా ఊటీగా పేరు గాంచిన హార్సిలీహిల్స్‌లో విడిది చేసి ఆదివారం తిరుగు పయనమయ్యారు. ఈ నేపథ్యంలో మండలంలోని కందుకూరు సమీపంలోని ఆవులమంద వద్ద ఎదురుగా వస్తున్న ఓ టీవీఎస్ వాహనాన్ని ఢీ కొన్నారు. ఘటనలో టీవీఎస్‌లో ప్రయాణిస్తున్న వేంపల్లికి చెందిన నాగేంద్ర (26)కు బలమైన గాయాలు కాగా బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోహిత్ (28)కు స్వల్పంగా గాయపడ్డాడు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని జింకల బోర్డు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి ఆదివారం నాకాబందీ నిర్వహించారు. మండలంలోని కాట్నగల్లు పంచాయతీకి చెందిన మాధవరెడ్డి (43) కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా 144 మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిరుపేద మహిళ పోషణకు సాయం



చిల్లర దుకాణం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ హరిహరప్రసాద్

మదనపల్లె సిటీ: పేద మహిళను ఆదుకోవాలన్న ధ్యేయంతో మదనపల్లె యూత్ కరాటే క్లబ్ ఓ మహిళ జీవనోపాధి కోసం చిల్లర దుకాణం పెట్టించి ఆదుకున్నారు. ఆదివారం స్థానిక కోటవీధిలో ఈశ్వరమ్మకు ఏర్పాటు చేసిన చిల్లర దుకాణాన్ని వన్ టౌన్ ఎస్.ఐ హరిహరప్రసాద్ ప్రారంభించారు. యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు ఏ.ఆర్.సురేష్ మాట్లాడుతూ ఈశ్వరమ్మ పూలు కట్టి జీవిస్తోందన్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉండటంతో ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.యూత్ కరాటే క్లబ్ సభ్యులు కలిసి తోపుడు బండి, సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామమూర్తి, యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి మణిసాయి, మహేశ్వర్, మిస్బా తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం కోటి విద్యలు

మదనపల్లె సిటీ: కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. ఓ కుటుంబం కూటి కోసం వేషాలు వేసుకుని భిక్షాటన చేస్తున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన రాము కుటుంబసభ్యులు గాంధీ వేషదారణ వేసుకుని మదనపల్లె పట్టణంలోని భిక్షాటన చేస్తున్నారు. ఆయనతో పాటు కుమారుడు శ్రీను కూడా వేషదారణతో మదనపల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద భిక్షాటన చేస్తున్నారు. ఎందు కోసమని అడిగితే బతుకుదెరువు కోసమని చెబుతున్నారు.



విచిత్ర వేషదారణతో శ్రీను

జర్నలిస్టులకు ఇంటి స్థలాలు నా బాధ్యత

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- మదనపల్లె అభివృద్ధికి సహకరించాలని పిలుపు



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

మదనపల్లె : నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటుగా తన వంతు సాయంగా 15 బస్తాల సిమెంట్, ఉచితంగా ఇసుక అందజేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌కు ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా హాజరైన షాజహాన్‌బాషాను, ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రెస్ అంటే ఫేస్ ఆఫ్ పబ్లిక్... ప్రజల ముఖచిత్రమని, వారి ద్వారానే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. సమాజ నిర్మాణంలో పాత్రికేయల పాత్ర కీలకమన్నారు. పట్టణంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. విలేకరులు బాధ్యతగా పనిచేసి మదనపల్లెలో మంచి సమాజాన్ని నిర్మించేందుకు సహకరించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అన్యాయాలను, ఆక్రమణలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, చంద్ర, కోశాధికారి ఆకులకిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు బాలుయాదవ్, జి.వి.శివారెడ్డి, జానంశ్రీనివాసులు, శ్రీనివాసులుగౌడ, వంశీధర్, ఎం.చంద్రమోహన్ గోపీరమణకుమార్, నక్కింటి మోహన, బాలనాగు, శివప్రసాద్, జిలానీ, సీతారామ్, మైసూర్‌యాదవ్, రామకృష్ణ, గంగాధర, నానబాలకుమార్ పాల్గొన్నారు.

రిషికేశవ సేవలు మరువలేనివి



రిషికేశవ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు, యంగ్ ఇండియా సేవా ట్రస్టు సభ్యులు

పెద్దతిప్పసముద్రం: మండలంలో ఎస్‌ఐగా, ములకలచెరువు సర్కిల్ పరిధిలో సీఐగా పని చేసిన రిషికేశవ ప్రజలకు చేసిన సేవలు మరువలేమని మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సీఐ మూడవ వర్ధంతి సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో పోలీసులతో కలసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిషికేశవ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడమే గాక పలు సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. అనంతరం ఎస్‌ఐ రవీంద్రబాబుతో పాటు పోలీసులకు ఘనంగా సన్మానించారు. పోలీసులతో కలసి ట్రస్టు నిర్వాహకులు రాజేష్, శ్రీనివాసులు, సుధాకర్, సూరి, అనిల్, మురళి, రమణ, మణి,రెడ్డెప్ప, శ్రీనివాసులు, ప్రతాప్, నారాయణప్ప, విశ్వనాథ్, శివారెడ్డి, చంద్రమోహన్, హరిలు స్థానిక బస్టాండ్‌లో ప్రజలకు అన్నదానం చేశారు.

దేవుడు నిర్మించిన గొప్ప వ్యవస్థ సంఘం



మాట్లాడుతున్న పాస్టర్ శ్యాంసన్ జాన్

కురబలకోట: ఏకాంత జీవితం భీతి గొల్పుతుంది.. అదే సంఘ జీవితం సంతృప్తిని ఇస్తుందని మదనపల్లె హెబ్రోను చర్చి సహ పాస్టర్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం శ్యాంసన్ జాన్ పేర్కొన్నారు. ఆదివారం అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో ఆరాధన, బల్లవర్తమానంలో ఆయన ముఖ్య అతిథిగా వాక్యోపదేశం చేశారు. ప్రజలెక్కడ క్రీస్తును తెలుసుకున్నారో అక్కడంతా సంఘాలు ప్రారంభమయ్యాయన్నారు. యేసు నామమున సంఘాలుగా కూడుకోవడం ఆ నాటి నుంచి ఆరంభమైందన్నారు. దేవుడు నిర్మించిన గొప్ప వ్యవస్థ సంఘమన్నారు. దేవుడు బయలు పరచిన సత్యంపై ఇది నిర్మితమైందన్నారు. సంఘం సక్రమంగా నడవాలంటే వాక్యాను సారమైన ప్రాథమిక సూత్రాలు పునాది లాంటివన్నారు. ఆత్మీయంగా బలపడటానికి సంఘాలు గొప్పగా పనిచేస్తాయన్నారు. విశ్వాసుల ప్రవర్తన, వ్యవహార శైలి వివాదానికి దారి తీసేవిగా ఉండరాదన్నారు. సమస్యలు సృష్టించరాదన్నారు. ప్రభువును సంతోషపరిచేలా ప్రవర్తన ఉండాలన్నారు.

మేలైన పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి

మదనపల్లె : పాడిపశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే మేలైన, నాణ్యమైన పశుగ్రాసాన్ని పచ్చిమేతగా అందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చిప్పిలిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక అధికారులు పశుగ్రాసాల సాగు, ఎంపిక, పాల ఉత్పత్తి, పశువుల పోషణ అంశాలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ కొద్దిపాటి పొలంలో ఏ రకమైన పశుగ్రాసం సాగుచేసుకోవాలి? ఏరకం అధిక పాల దిగుబడి ఇస్తుంది? తదితర అంశాలను రైతులకు వివరించారు. పాడి పశువుల పెంపకంలో పశుగ్రాసాలకు చాలా ప్రాముఖ్యత ఉందని, ప్రతి పాడిరైతు తనకు ఉన్న భూమిలో కనీసం 10 సెంట్లు అయినా అధిక పాల దిగుబడి ఇచ్చే సూపర్ నేపియర్, కో–1,2,3, జొన్న, మొక్కజొన్న తదితర గ్రాసాలు సాగుచేసుకోవాలన్నారు. పచ్చిగడ్డితో పాటు 5 కిలోలు ఎండుగడ్డి, సమపాళ్లలో దాణా వేసినట్లయితే పాల దిగుబడి, వెన్నశాతం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ వైద్యులు ప్రసాదరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ సీకేఆర్‌పల్లెలో ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. బ్రహ్మారెడ్డి, కోఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి, మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ కేన్సర్ నివారణ కోసమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 23 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 126 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిరోషా, డాక్టర్ విద్య, డాక్టర్ విద్య, వలంటీర్లు శ్రీనివాసులు రెడ్డి, ఆదినారాయణ, రామాంజనేయులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మతల్లీ...కరుణించమ్మా



సంతాన కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించారు. అలాగే పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

పెద్దమండ్యం: వాళ్లందరూ ఆ పాఠశాలలో పదవ తరగతి చదివి 20 సంవత్సరాలవుతోంది. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించాలని, అందరు ఒక్కసారి కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అంది పుచ్చుకొని స్థిరపడి ఉన్నవారందరి కలయికకు ఆదివారం వెలిగల్లు ఉన్నత పాఠశాల వేదికైంది. పాఠశాలలో వెలిగల్లు, తురకపల్లె, నడింబురుజు, పాపదాతగారిపల్లె, కుదుములవారిపల్లె, బండమీదపల్లె గ్రామాలకు చెందిన 2003–2004 పదవతరగతి పూర్తి చేసిన విద్యార్థులు కలుసుకొని సందడి నెలకొంది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే ఒకరి యోగక్షేమాలు ఒకరిని అడిగి తెలుసుకున్నారు.

అన్నదానం

బి.కొత్తకోట: సీఐ రిషికేశవ మూడవ వర్ధంతి సందర్భంగా యంగ్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు బి.కొత్తకోట పెద్దచెరువు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్‌ఐ బొజ్జినాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంచార జీవనం సాగించే వారికి అన్నదానం చేశారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజుగౌడ్, కానిస్టేబుళ్ల శేఖర్, రమణ, ఫౌండేషన్ ఛైర్మన్ రాజశేఖర్, సభ్యులు శ్రీను, అనిల్, మురళీ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై సందడి



అటవీపార్కులో చిన్నారుల సందడి

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకిస్తూ సందడి చేశారు. అటవీ ప్రాంగణం, గాలిబండ, బోటింగ్, వ్యూపాయింట్ల వద్ద పర్యాటకులు రద్దీగా కనిపించారు. కాగా వాతావరణం పూర్తిగా చల్లబడి మేఘాలు కమ్ముకోవడంతో చల్లటి గాలులు పర్యాటకులను ఆహ్లాదపరిచాయి.

ఐదుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని కోటవారిపల్లె తాండా సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో జూదం ఆడుతున్న బసినికొండకు చెందిన లోకేశ్వరరెడ్డి(33), వినయ్ కుమార్(24), మోతీనగర్‌కు చెందిన నరేష్(38), నారమాకులతండాకు చెందిన చిన్నబుడ్డన్ననాయక్, ఉదుంవారిపల్లె తండాకు చెందిన శంకరనాయక్(47)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ వెంకటేష్, రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మతల్లీ .. దీవించమ్మా



అమ్మవారికి దీలు,బోనాలు సమర్పిస్తున్న మహిళలు

వాల్మీకిపురం: స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీలో వెలసిన శ్రీ శక్తిమాత(గంగమ్మ) అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మంగళ వాయిద్యాల నడుమ శక్తిమాత అమ్మవారికి స్వచ్ఛమైన గంగాజలాలను తీసుకొచ్చి నడివీధి గంగమ్మలతో పాటు ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ మహిళలు దీలుబోణాలను భక్తిశ్రద్ధలతో ఊరేగింగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం చేశారు. అనంతరం పుష్పపల్లకీపై అమ్మవారిని అధిరోహించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రప్ప, మధు, గంగాధర్, రమేష్, రాజేష్, వెంకటేష్, సంతోష్, అర్జున్, అరుణ్, స్టాలిన్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మొహర్రం..వెల్లివిరుస్తున్న సామరస్యం



జామియా మసీదు వద్ద కొలువుదీరిన పీర్లు

మదనపల్లె సిటీ: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా మదనపల్లెలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని జామియా మసీదు పపాయ్ మకాన్ వద్ద పీర్లను కొలువు వుంచారు. స్థానిక నెహ్రూబజార్‌లోని తాటిమాను పీర్ల చావిడి వద్ద పీర్లను కొలువు వుంచి ప్రత్యేక అలంకరణ చేశారు. హిందూ, ముస్లింలు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. చావిళ్లను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు చోట్ల అగ్నిగుండాలు తవ్వారు. రాత్రి పీర్లను ఊరేగింపు నిర్వహించారు.

మొహర్రం వేడుకలు

రామసముద్రం: మండలంలోని తిరుమలరెడ్డిపల్లి, దిగువపేట, ఎగువపేట, నడింపల్లి గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరుపుకున్నారు. రాత్రి గంధపు పీర్లకు, బాబయ్యలకు మట్టి కుండలో పానకం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలు తిలకించడానికి మండలంలోని ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కొలువుదీరిన పీర్లు

కేవీపల్లె : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గుర్రెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట గ్రామాల్లో పీర్లను కొలువు దీర్చారు. ఆదివారం ఆయా గ్రామాల్లోని పీర్లను డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీర్ల చావిడిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి చదివింపులు చదివించారు. పలువురు భక్తులు పీర్లను సందర్శించారు.

నేడు పెద్దపీర్ల మెరవణి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో సోమవారం పెద్దపీర్ల మెరవణి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుల మతాలకు అతీతంగా జరిగే మొహర్రం ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరారు.